క్లుప్తంగా

నేడు మండల సమావేశం

మక్తల్: మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సద్గుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించండి

నారాయణపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఖాళీ స్థలాల్లో యజమానులు పిచ్చి మొక్కలు, చెత్త చెదారం తొలగించాలని మున్సిపల్ కమిషనర్ సునీత బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరగడంతో విషకీటకాలకు నిలయంగా మారి పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఇళ్లలో ఉత్పత్తి అయిన చెత్తను నిరుపయోగ వస్తువులను మున్సిపల్ ఆటో, ట్రాక్టర్‌లలో వేయకుండా ఇళ్ల మధ్య ఉన్న ఖాళీస్థలాల్లో వేసి పట్టణ పరిశుభ్రతకు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. పట్టణంలో ఖాళీ స్థలాల యజమానులు ఈ నెల 20లోపు ముళ్లపొదలు, చెత్తలేకుండా శుభ్రం చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా గుర్తించాలి

మరికల్: మండలంలోని అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. అప్పంపల్లికి చెందిన రైతుల భూములు మందిపల్లి, మరికల్, కిష్టాపూర్, పస్పుల, మాధవరం గ్రామాల శివారులో ఉండటంతో పంటరుణాలు, ఆర్‌ఓఆర్‌లు, పహణీలు తీసుకోవాలంటే అధికారుల చుట్టు తిరగలేకపోతున్నామని వాపోయారు. మరికొన్ని కొత్త మండలాలను ఏర్పాటు చేయబోతున్న రాష్ట్ర ప్రభుత్వం అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా మార్చాలని వారు కోరారు.

నోట్ పుస్తకాల పంపిణీ



ఊట్కూరు: మండలంలోని శ్రీరామ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం సర్పంచ్‌ను సన్మానించారు. హెచ్‌ఎం తిప్పన్న, ఉపాధ్యాయులు రవి, డాక్టర్ రఘు, కృష్ణ పాల్గొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా..



ఊట్కూరు: మండలంలోని గ్రామ శివారులో బుధవారం అదుపుతప్పి ఆటో బోల్తాపడ్డ సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. మక్తల్ నుంచి ఆటోలో మెడిసిన్ డబ్బాలు తీసుకుని నారాయణపేటకు వెళ్తుండా బీటీరోడ్డుపై గుంతలు, ఇసుక ఉండడంతో అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. డ్రైవర్ ఆటో నుంచి కిందకి దూకడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. అక్కడే ఉన్నస్థానికులు రవి కుమార్, అశోక్‌కుమార్, మహేష్ స్థానికుల సాయంతో జేసీబీతో ఆటోను తరలించారు.

డిగ్రీ కళాశాల తరగతులు ప్రారంభం

ధన్వాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన డిగ్రీ కళాశాలలో బుధవారం తాత్కలిక జూనియర్ తరగతులను ప్రారంభించారు. ఇందులో నాలుగు సెమిష్టర్‌కు సంబంధించిన తరగతులను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ రంగారెడ్డి తెలిపారు. అధ్యాపకులు సురేష్ తదితరుల ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మక్తల్: పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని మండల ప్రజలు కోరారు. గతంలో జరిగిన మండల సమావేశంలో సమస్యలు పరిష్కరించకపోవడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారుల పనితీరు సక్రమంగా లేక పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి వసతి, కరెంట్, విద్యారంగ, పంచాయతీరాజ్ పనులు వాటిపై ప్రత్యేకంగా అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని కోరారు.

కీళ్లమార్పిడి ఆపరేషన్ విజయవంతం

నారాయణపేట రూరల్: కర్ణాటక రాష్ట్రం సంబరం గ్రామానికి చెందిన ఆశమ్మ (48) కొన్ని ఏళ్లుగా కీళ్లనొప్పులతో బాధపడుతుంది. ఈ క్రమంలో బుధవారం పట్టణంలోని సునంద ఆస్పత్రికి వచ్చింది. డాక్టర్ ప్రసాద్‌శెట్టి, దీపికా శెట్టి పరీక్షించి మోకాళ్లలోని కీళ్లను మార్పిడి చేసి విజయవంతంగా ఆపరేషన్‌ను పూర్తిచేశారు.

సంత గోల..!

- కలగా మిగిలిన కూరగాయల మార్కెట్
- బస్టాండ్ ఎదురుగా అంగడి
- రోడ్డుపై వాహనల రాకపోకలకు ఇబ్బందులు



కనీస వసతులు లేని మరికల్ సంత

మరికల్: ''నారాయణపేట జిల్లాకు ముఖ్యపట్టణంగా ఉన్న మరికల్‌లో మాత్రం ఒక అడుగు ముందుకెస్తే మూడు అడుగులు అభివృద్ధి విషయంలో వెనకడుగు పడుతోంది. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల్లో ఒక్కరంటే ఒక్కరికి గిట్టక పోవడంతో సమస్యలు సమస్యగానే మిగిలిపోతున్నాయి. నాలుగు మండలాలకు ప్రధాన కేంద్ర బిందువుగా ఉన్న మరికల్‌లో కనీసం సంతకు ప్రత్యేక మార్కెట్ లేక రోడ్లపై చిరువ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తైబజార్ పేరుతో వ్యాపారులతో డబ్బులు దండుకుంటున్న వీరి బాధలను మాత్రం ఎవరు పట్టించుకోవడంలేదు.

నియోజకవర్గంలో ఇలా...

నియోజకవర్గంలో నారాయణపేట మినహా మరికల్, ధన్వాడ, దామరగిద్ద, కోయిల్‌కొండ మండలాల్లో సంతలకు ప్రత్యేక స్థలం లేక రోడ్లపైనే వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్న విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వీరిగోడును ఎవరూ పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా అంగట్లో కనీస వసతులు కల్పించాల్సిన అధికారులు విఫలమవుతున్నారు. సంతలో వ్యాపారం చేసే వ్యాపారులకు మరుగుదొడ్లు, టెంట్లు, నీటి వసతి కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కనీస వసతులు లేక వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరికల్‌లో ఇరుకైన స్థలం ఉండటంతో జేబుదొంగల తాకిడి పెరిగింది. సంతకు ప్రత్యేక స్థలం కేటాయించేందుకు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటే బాగుటుందని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

కూరగాయాల మార్కెట్ నిర్మించాలి



సంతలో కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇతర గ్రామాల నుంచి వచ్చిన వ్యాపారులకు కనీసం మరుగుదొడ్లు, టెంట్లు, నీటి వసతి కల్పించకపోవడంతో రోడ్లపైనే భోజనాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అన్నివసతుల కల్పనతో కూరగాయాల మార్కెట్ నిర్మాణం చేపట్టాలి.

\- అనిత, కూరగాయాల వ్యాపారి

వసతులు లేవు



వారంతపు సంతలో అధికారులు మరుగుదొడ్లు, టెంట్లు, నీటివసతి లాంటి సౌకర్యం కల్పిస్తే వ్యాపారులకు, వినియోగదారులకు ఇబ్బంది ఉండదు. తైబజార్ వసూలు చేస్తున్నారు. కానీ తమ గోడును మాత్రం పట్టించుకోకుండా పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. వసతులు కల్పిస్తేనే తైబజార్ వసూలు చేయాలి.

\- అంజిల్‌రెడ్డి, కూరగాయాల వ్యాపారి

చర్యలు తీసుకుంటాం

వారంతపు అంగట్లో కనీససౌకర్యాలు కల్పించేందుకు ఇది వరకే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వసతులు లేని సంతలో కనీస సదుపాయాలు కల్పించేందుకు అక్కడి సర్పంచ్‌లతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

\- మురళి, డీఎల్‌పీఓ

రక్తహీనతపై జాగ్రత్తగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శైలజ

మరికల్: రక్తహీనత వల్ల వచ్చేప్రమాదకరమైన వ్యాధులతో గర్భిణులు చాలా జాగ్రత్తగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శైలజ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో రక్తహీనతపై గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు ముఖ్యంగా పౌష్టికాహారం తీసుకుంటే ఇలాంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని చిన్నారులతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉండే ప్రతి గర్భిణికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కిరిటి, ఎంపీహెచ్‌ఓ అరవింద్, ఐసీడీసీ సూపర్‌వైజర్ మహేశ్వరీ అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, హైమావతి, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జీపీఎఫ్ డబ్బులు త్వరగా చెల్లించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : జిల్లాలో పలువురు ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్న జీపీఎఫ్ లోన్‌లను వెంటనే అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని జెడ్పీసీఈఓ శైలజను కలిసి బుధవారం తపస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. 2019–20 నుంచి 2022–23 వరకు దాదాపు 20మందికిపైగా అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఆన్‌లైన్‌వర్క్ వెంటనే ప్రారంభించాలని కోరారు. అనంతరం సీఈఓ మాట్లాడుతూ.. సంక్రాంతి పండగ తర్వాత తప్పకుండా క్లియర్ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కో–షాధికారి కిశోర్‌కుమార్, మండల అధ్యక్షుడు శ్యాంప్రసాద్, విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు షీటీమ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఏఎస్‌ఐ శ్రీదేవి

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్, కళాశాలలో బుధవారం షీటీమ్స్‌పై అవగాహన నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఎస్‌ఐ శ్రీదేవి మాట్లాడుతూ.. మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయం తెలిసి ఉండాలని, ప్రతీ బాలిక గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్గి ఉండాలన్నారు. ఎవరైన ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్‌లైన్ నెంబర్ 8712670398కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్, టీచర్లు, షీటీమ్ సభ్యులు బాలరాజు, నమీనా, లాయక్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

- ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట రూరల్: మండల సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని, తిరిగి అవే సమస్యలు రిపీట్ అయితే ఉపేక్షించేదిలేదని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ సమావేశంలో బుధవారం ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సమావేశానికి హాజరుకాగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వేర్వేరుగా శాలువా, పూలమొక్కలతో సన్మానం చేశారు. సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై అధికారులు ఇచ్చిన వివరణ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు.. పార్టీలకు సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని శాఖల్లో ఖాళీల వివరాలను పక్షం రోజుల్లో అందించాలన్నారు. పార్టీలకు అతీతంగా సమస్యల పరిష్కారానికి కలిసి పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అంజలి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, తహసీల్దార్ రాణాప్రతాప్, ఎంపీడీఓ వెంకటయ్య, సూపరింటెండెంట్ శోభారాణి పాల్గొన్నారు.

చర్చించిన అంశాలు ఇవే.

- ఎన్నికలు జరిగి నెల రోజులు గడుస్తున్న రైతుబంధు సాయం అందించలేదని, ఏక కాలంలో నిధులు విడుదల చేయాలని వ్యవసాయశాఖ అధికారి శరత్ చంద్రను ప్రశ్నించారు.
- పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో రావడంలేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శశికిరణ్‌ను అడిగారు.
- కొల్లంపల్లిలో 20రోజులకే విద్యుత్ బిల్లులను వసూలు చేస్తున్నారని, కాంగ్రెస్ వస్తే బిల్లులు మాఫీ అని హామీ ఇచ్చి ఎందుకు వసూలు చేస్తున్నారని ఏఈ సాయినాథ్‌రెడ్డిని ప్రశ్నించారు.
- గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా డీడీలు కట్టిన లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలని వెటర్నరీ డాక్టర్ అనిరుధ్ ఆచార్యను కోరారు.
- జీపీలకు కేటాయించిన నిధులుబ్యాంకుఅకౌంట్లో కనిపించడంలేదని ఎంపీఓ బాలాజీని అడిగారు.
- పీజీతండా–పాతతండాతో పాటు పలు రోడ్లను వేయాలని పీఆర్ ఏఈ నర్సింగ్‌రావును కోరారు.
- మిగితా శాఖల అధికారులు వారివారి పరిధిలోని నివేధికలను చదివి వినిపించారు.

గ్రామ పంచాయతీ అభివృదిద్ధికి కృషి

దామరగిద్ద: వెనకబడిన గ్రామాల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషిచేస్తానని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. బుధవారం మండలంలో యల్సాన్‌పల్లి గ్రామానికి మంజూరైన పంచాయతీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. సర్పంచ్ దేవిక పరిపూర్ణం, ఎంపీటీసీ అంజిలప్ప, ఎంపీటీసీ బస్వరాజ్, ఎంపీడీఓ శ్రీదర్, ఈదప్ప, మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, శరణ్యానాయక్, పాల్గొన్నారు.

బడి బయటి పిల్లల సర్వే



కోస్గి: డీఈఓ ఆదేశాల మేరకు సోమవారం సీఆర్‌పీలు బడిబయటి పిల్లల సర్వే నిర్వహించారు. మ ండల కేంద్రంలో సీఆర్పీ దస్తయ్య ఇంటింటికీ వెళ్లి పిల్లల వివరాలు సేకరించారు. బడిబయటి పిల్లల వివరాలు సేకరించి నమోదుచేశారు. గుర్తించిన ఇద్దరు విద్యార్థులను గుండుమాల్‌లోని ఓపెన్ స్కూల్‌లో చేర్పించినట్లు సీఆర్పీ దస్తయ్య తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

దామరగిద్ద: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే పర్ణికారెడ్డి హాజరవుతున్నట్లు తహసీల్దార్ నాగజ్యోతి తెలిపారు. అర్హులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదిముభారక్ చెక్కులను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విధిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి సన్మానం



మక్తల్: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బుధవారం హైదరాబాద్‌లో మంత్రి చాంబర్‌లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి శాలువాతో సన్మానించారు. నియోజకవర్గంలో ఉన్న రిజర్వాయర్లు, మరమ్మతు, చెరువులకు నీటిని వదిలే విషయంపై మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

దరఖాస్తు ఆన్‌లైన్‌ల పరిశీలన

ఊట్కూరు: మండలంలోని ఐకేపీ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తు ఆన్‌లైన్ ప్రక్రియను బుధవారం ఎంపీడీఓ రమేష్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 17920దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వివిధ శాఖల అధికారుల సాయంతో దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నామని ఆయన తెలిపారు.



పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



మద్దూర్‌లో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం పీఆర్టీయూ టీఎస్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో కలిసి ఆమె క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.. ప్రభుత్వం ఎల్లప్పుడు విద్యాభివృద్ధికి కృషిచేస్తుందని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే మండల కేంద్రంలోని రైతు వేదికలోని బుధవారం ఎమ్మెల్యే పర్ణికారెడ్డి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్, మండల ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, బసన్న, హెచ్‌ఎం సంధ్యారాణి, తహసీల్దార్ సింధూజ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరహరి, అఖీల్, బాలరాజు, శ్రీనివాసులు, సుధీర్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మద్దూర్: పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన క్యాలెండర్‌ను బుధవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆవిష్కరించారు. క్యాలెండర్‌ను జెడ్పీ బాలుర ఉన్నతపాఠశాలలో హెచ్‌ఎం వెంకట్రామ్‌రెడ్డి, జిల్లా నాయకుల చేతులమీదుగా ఆవిష్కరణ నిర్వహించారు. అనంతరం ఆ సంఘం నాయకులతో కలిసి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్, రాజు నాయక్, రవి కుమార్, సూర్యప్రకాష్, వేణుగోపాల్, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధన ఉత్సవాలు



స్వామివారి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని శ్రీ రాఘవేంద్రస్వామి ఆలయంలో బుధవారం జితా మిత్రరాయుల ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రాలయం గురుసార్వభౌమ విద్యాపీఠం ప్రాజెక్టు అధికారి వాదిరాజ ఆచార్య ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కార్యక్రమంలో జయతీర్థ, రమేష్, అర్చకులు నర్సింహాచారి, శక్తిపీఠం వ్యవస్థాపకులు శాంతానంద్ పురోహిత్, బీంసేన్‌రావు, నర్సింహ, పద్మనాభరావు, నారాయణరావు, వినోద్, శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను సక్రమంగా నమోదు చేయాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అశోక్

దామరగిద్ద: ఓటర్ల జాబితాను సక్రమంగా అప్‌డేట్ చేయాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీఎల్‌ఓల శిక్షణ తరగతులను ఆయన ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఫొటో సిమిలర్ ఎంట్రిస్, డాటా సిమిలర్ ఎంట్రీస్ తొలగింపు వంటి వివరాలను ఆధార్ అనుసందానం చేస్తు ఓటర్ల జాబితాను సరిచూడాలన్నారు. డాటా, ఫొటోలు డబుల్ ఎంట్రీ లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ కాళప్ప, సీనియర్ అసిస్టెంట్ రాము, ఆర్ఐ, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నర్వ: విద్యార్థులు సంపూర్ణమైన ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ఎత్తుకు తగ్గ బరువు కలిగి ఉండాలని ఆర్‌బీఎస్‌కే వైద్యులు డా.రామకృష్ణరెడ్డి అన్నారు. బుధవారం సీపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరిక్షలను ఆర్‌బీఎస్‌కె వైద్యబృందం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య పరిక్షలను నిర్వహించి, ఎత్తు, బరువులను కొలిచారు. ధీర్ఘకాలిక రోగాలు ఎవరైన కలిగి ఉన్నారా ఉంటే అటువంటి వారిని గుర్తించి జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తామన్నారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్నభోజనం పౌష్టికాహారంతో కూడిన మెనూ పాటించాలని విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యవంతంగా, చురుగ్గా ఉంటారన్నారు. ఈ ఆరోగ్య పరీక్షల్లో ఆర్‌బీఎస్‌కే వైద్య బృదం వైద్యులు డా.సంతోషిణి, ఆశాకార్యకర్తలు, హెచ్‌ఎం ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మాగనూర్: చిన్నారులు, బాలింతలు, గర్భిణిలకు పౌస్టికహారం తప్పనిసరి అని మండల వైద్యాధికారిణి విరోజ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో రక్తహీనత రాకుండా ముందస్తుగా జాగ్రత్తగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు రక్తహీనత భారీన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని సూచించారు. వీటితోపాటు ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పీఓ డాక్టర్ రాఘవేంద్ర, ఏఎన్‌ఎం సుధారాణి, ఆశా కార్యకర్తలు అనంతమ్మ, ఆశమ్మ, కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

శబరికి తరలిన అయ్యప్పస్వాములు



మద్దూర్‌లో ర్యాలీగా వెళ్తున్న అయ్యప్పస్వాములు



ధన్వాడలో

మద్దూర్: అయ్యప్ప మాలాధారణ చేసిన స్వాములు తమ మండల దీక్షను పూర్తి చేసుకొని అయ్యప్ప దర్శనం కోసం బుధవారం ఇరుముడులతో శబరి యాత్రకు బయలు దేరారు. ఈ మేరకు పట్టణంలోని పాత బస్టాండ్ ఆంజనేయ స్వామి ఆలయంలో స్వాములు ఇరుముడులు కట్టుకొని శబరికి బయలు దేరారు. గురుస్వాములు మహేష్, విష్ణు, శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో స్వాములు శబరికి తరలివెళ్లారు. పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ఇరుముడులతో ర్యాలీగా వెళ్లి అక్కడ నుంచి వాహనాల్లో అయ్యప్ప సన్నిధికి తరలి వెళ్లారు.

ధన్వాడ: నియమనిష్టలతో 41 రోజులపాటు అయ్యప్ప మాలధారణ చేసిన అయ్యప్పస్వాములు బుధవారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వాములు శబరిమల వెళ్లే భక్తులు ఇరుముడులు కట్టారు. గురుస్వాములు ఉమేష్, గోవర్ధన్‌గౌడ్, వేణు, నవిన్, మల్లేష్, వెంకటేష్, శ్రీనివాసులు ఇరుముడులతో శబరిమలకు బయలుదేరి వెళ్లారు. అయ్యప్పమాలధారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

నారాయణపేట రూరల్: పట్టణంలోని శివాజీనగర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఈఓగా మాధవ్, ఎంఈఓగా నవీన్, హెచ్‌ఎంగా ఎం.నవీన్ వ్యవహరించారు. పలువురు చిన్నారులు టీచర్లుగా తమ విధులను చక్కగా నిర్వహించారు. అనంతరం విద్యాబోధన చేసిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బలరాంనాయక్, టీచర్లు బాలరాజు, అపర్ణ, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రానికి చుట్టు ఏర్పాటుచేసిన ఇటుక బట్టీల వ్యాపారస్తులతో బుధవారం సీఐ రవిబాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 18సంవత్సరాలలోపు చిన్నారులను పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం శిక్షార్హులని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కుటుంబాల్లోని పిల్లలను బడికి పంపేవిధంగా వారి తల్లిదండ్రులను ఒప్పించాలన్నారు. అనంతరం బాలకార్మిక వ్యవస్థ, లేబర్‌యాక్ట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విజయ్, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.